# అభివృద్ధి ప్రదాతకు ఘన స్వాగతం పలుకుదాం

- జనగామలో లక్షమందితో 'ప్రజా ఆశీర్వాద సభ'
- ప్రజలు స్వచ్ఛందంగా తరలిరావాలి
- మంత్రి ఎర్రబెల్లి పిలుపు
- టీ-పీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డిపై దయాకర్‌రావు ఫైర్
- పైసలకు అమ్ముడుపోయే నువ్వెంత.. నీ బతుకెంత అని మండిపాటు
- జనగామలో బీఆర్ఎస్ అభ్యర్థి పల్లా, ఎమ్మెల్యేలు ముత్తిరెడ్డి, రాజయ్యతో కలిసి విలేకరుల సమావేశం
- హెలిప్యాడ్, సభ ఏర్పాట్ల పరిశీలన


బహిరంగ సభ ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్న మంత్రి ఎర్రబెల్లి, చిత్రంలో ఎమ్మెల్యేలు ముత్తిరెడ్డి, తాటికొండ, ఎమ్మెల్సీ పల్లా రాజేశ్వర్‌రెడ్డి, జడ్పీ చైర్మన్ సంపత్‌రెడ్డి

జనగామ, అక్టోబర్ 14 (నమస్తే తెలంగాణ) : జనగామను జిల్లా చేసి, గోదావరి నీటితో సస్యశ్యామలంగా చేసిన సీఎం కేసీఆర్‌కు ఘన స్వాగతం పలకాలని ప్రజలకు మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు పిలుపునిచ్చారు. ప్రతి ఇంటి నుంచి స్వచ్ఛందంగా బహిరంగసభకు తరలిరావాలని కోరారు. శనివారం జనగామ బీఆర్ఎస్ కార్యాలయంలో ఎమ్మెల్యేలు ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి, డాక్టర్ టి.రాజయ్య, బీఆర్ఎస్ జనగామ అభ్యర్థి, ఎమ్మెల్సీ పల్లా రాజేశ్వర్‌రెడ్డి, జడ్పీ చైర్మన్ పాగాల సంపత్‌రెడ్డితో కలిసి విలేకరులతో మాట్లాడారు. ఈ నెల 16న జనగామలో సీఎం కేసీఆర్ బహిరంగ సభ వివరాలను వెల్లడించారు. తెలంగాణ అభివృద్ధి ప్రదాత సీఎం కేసీఆర్‌ను, బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని కాపాడుకునేందుకు మహిళలు, రైతులు, యువత, పెన్షనర్లు జనగామకు తరలివస్తున్నారని చెప్పారు. సభ కోసం నాయకులు ప్రజలతో కలిసి రావాలని, ప్రజల మధ్య ఉండాలని, ప్రజల సౌకర్యాలను చూడాలని కోరారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలో జరుగుతున్న మొదటి ఎన్నికల సభకు ప్రజలు పెద్ద ఎత్తున తరలివచ్చి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. 'కేసీఆర్ దయతోనే జనగామ జిల్లా అయింది. అభివృద్ధిలో ముందు వరసలో ఉంది. ఇంకా అభివృద్ధి చేసే బాధ్యత మాది' అని స్పష్టం చేశారు. మిషన్ భగీరథ, దేవాదుల ద్వారా జనగామకు పుష్కలంగా తాగు, సాగునీరు లభిస్తున్నదంటే అది సీఎం కేసీఆర్ కృషి ఫలితమేనన్నారు. కేంద్రం చిన్నచూపు చూసినా తెలంగాణ అన్ని రంగాల్లో నంబర్ వన్ అయిందని, గుజరాత్‌ను మంచిపోయిందని, సాగునీరు, పంటలు, కరంట్, ఐటీ పరిశ్రమల్లో అగ్రగామిగా నిలిచిందని బీజేపీ కేంద్ర మంత్రులే చెప్పారని గుర్తుచేశారు.

***రేవంత్ ఓ బ్రోకర్..చీటర్..**

'రేవంత్ ఓ బ్రోకర్..చీటర్..పైసలకు అమ్ముడుబోయే క్యారెక్టర్ లేని నువ్వెంత..? నీ బతుకెంత.. పెద్ద చదువులు చదివి అమెరికాలో మంచి కంపెనీలో ఉద్యోగం చేసిన వ్యక్తిని అవమానిస్తావా? కేటీఆర్‌పై మాట్లాడే అర్హత నీకుందా?!.. జాగ్రత్తగా మాట్లాడడం నేర్చుకో' అంటూ పీసీసీ చీఫ్‌పై మంత్రి ఎర్రబెల్లి మండిపడ్డారు. తెలంగాణలో కాంగ్రెస్ అట్టర్ ఫ్లాప్ అని..డబ్బులకు టికెట్లు అమ్ముకుంటున్నాడని వాళ్ల పార్టీ నేతలే అంటుంటే ఇంకా సిగ్గు లేకుండా మాట్లాడుతున్నావా? అని ప్రశ్నించారు. 'నీలా మాకు రోత మాటలు రావు..నువ్వు తిమ్మిని బమ్మి చేస్తావ్.. నువ్వు, నీ బతుకు గురించి ఆలోచించు, నీ కుటుంబమేంది? నీ బతుకేంది?' అని ఎర్రబెల్లి భగ్గుమన్నారు. 'ఏడాదికోసారి పార్టీ మారే బతుకు నీది..కొడంగల్‌లో చిత్తుగా ఓడిపోయినోడివి.. దమ్ముంటే రంగారెడ్డి జిల్లాలో పోటీ చేసి గెలువు' అని సవాల్ చేశారు. రేవంత్ రాగానే కాంగ్రెస్ పని ఖతమైందని, ఆ పార్టీ గ్రాఫ్ ఘోరంగా పడిపోయిందని, 15న బీఆర్ఎస్ మేనిఫెస్టోతో తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ ఖతమవుతందన్నారు. 'ప్రజలు కాంగ్రెస్‌ను నమ్మే పరిస్థితిలో లేరు.. పక్క రాష్ట్రాల్లో 6 గ్యారెంటీలు ఇయ్యని మీరు ఇక్కడ ఇస్తా అంటే ఎట్ల నమ్ముతరు..? ఒకప్పుడు గిరిజన గూడేలను గ్రామ పంచాయతీలు చేస్తాం, రిజర్వేషన్లు పెంచుతాం అని చెప్పిన వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ఏ ఒక్కటీ చేయలేదు' అని గుర్తుచేశారు.

**పొన్నాల రాకను స్వాగతిస్తున్నాం..**

సీనియర్ నాయకుడు.. బీసీ నేత పొన్నాల లక్ష్మయ్య జనగామకు ఎంతో కొంత సేవ చేశారని, ఐదు పార్టీలు మార్చిన రేవంత్‌రెడ్డి కాంగ్రెస్‌లోకి వచ్చి పొన్నాల వంటి మహానేతను తిట్టడం సిగ్గుచేటని, అంతపెద్ద మనిషిని పట్టుకొని అలా మాట్లాడడం బాధాకరమని, రేవంత్ మాటలను ఖండిస్తున్నామని మంత్రి పేర్కొన్నారు. రేవంత్ రాజకీయ విలువలను దిగజారుస్తున్నాడని ఆగ్రహం వ్యక్తం చేశారు. '40 సంవత్సరాలుగా పొన్నాల కాంగ్రెస్‌ను పట్టుకొని ఉన్నడు.. పదేండ్ల కష్టకాలంలో నమ్ముకొని పనిచేసిన చరిత్ర లక్ష్మయ్యది.. నువ్వు పార్టీలోకి మధ్యలో వచ్చి దందాలు చేసినోడివి.. రెండుసార్లు నువ్వు ఓడిపోతే మళ్లీ టికెట్ తీసుకోలేదా?..ఆయన అడిగితే తప్పేంటి' అని ప్రశ్నించారు. పొన్నాల బీఆర్ఎస్‌లోకి వస్తానంటే ఆయన ఇంటికి వెళ్లి స్వాగతిస్తామని చెప్పారు.

**సభకు భారీగా తరలిరండి..**

పల్లా రాజేశ్వర్‌రెడ్డి, ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి, రాజయ్య మాట్లాడుతూ ఎడారిగా ఉన్న జనగామ కేసీఆర్ నాయకత్వంలో ఇప్పుడు ఆకుపచ్చగా మారిందని, తెలంగాణ వస్తే ఏం వస్తుందన్న వారికి గతానికి, ఇప్పటికి బేరీజు వేసుకుంటే అర్థమవుతుందన్నారు. సీఎం కేసీఆర్ సభకు ప్రజలను తీసుకువచ్చే నాయకులు అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని, వాళ్లను తిరిగి ఇళ్లలో దిగబెట్టే వరకు బాధ్యత వహించాలని కోరారు. అంతకు ముందుకు మంత్రి ఎర్రబెల్లి, ఎమ్మెల్యేలు, అభ్యర్థి పల్లా కలిసి హెలిప్యాడ్, బహిరంగసభా వేదిక వద్ద ఏర్పాట్లను పరిశీలించారు. వీరివెంట మార్కెట్ చైర్మన్ బాల్దె సిద్ధిలింగం, మున్సిపల్ చైర్మన్ పోకల జమున, కొమురవెల్లి ఆలయ మాజీ చైర్మన్ సేవెల్లి సంపత్, జడ్పీటీసీ నిమ్మతి దీపిక, పీఏసీఎస్ చైర్మన్ నిమ్మతి మహేందర్‌రెడ్డి, బీఆర్ఎస్ నాయకులు జల్లి సిద్ధయ్య, బండ యాదగిరిరెడ్డి, ఏబెల్, కందుకూరి ప్రభాకర్, లెనిన్, శారద పాల్గొన్నారు.


జనగామలో జరిగే సీఎం కేసీఆర్ సభ భద్రతా ఏర్పాట్లను పరిశీలిస్తున్న వరంగల్ సీపీ అంబర్‌కిశోర్, డీసీపీ సీతారాం

## సీఎం బహిరంగ సభ భద్రతా ఏర్పాట్లను పరిశీలించిన సీపీ అంబర్‌కిశోర్‌ఝా

జనగామ చౌరస్తా, అక్టోబర్ 14 : అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో భాగంగా ఈ నెల 16న సీఎం కేసీఆర్ జనగామలో నిర్వహించనున్న బహిరంగ సభకు హాజరవుతున్న నేపథ్యంలో భద్రతా ఏర్పాట్లను వరంగల్ సీపీ అంబర్ కిశోర్ ఝా శనివారం పరిశీలించారు. జిల్లా కేంద్రంలోని గీతానగర్ ప్రభుత్వ మెడికల్ కళాశాల ఆవరణలో సభా ప్రాంగణం, వేదిక, వీవీఐపీ, వీఐపీ, మీడియా గ్యాలరీ, భారికేడ్లు, హెలీ ప్యాడ్, బహిరంగ సభకు ప్రజలు వచ్చిపోయే మార్గాలు, పార్కింగ్ ఏరియా స్థలాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేశారు. భద్రత ఏర్పాట్లపై తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సంబంధిత పోలీసు అధికారులకు పలు సూచనలు చేశారు. అంతకు ముందు వరంగల్ పోలీస్ కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టి తొలిసారి వెస్ట్‌జోన్ డిప్యూటీ పోలీస్ కమిషనర్ కార్యాలయానికి విచ్చేసిన సీపీ అంబర్ కిశోర్ ఝాకు డీసీపీ పీ సీతారాం మర్యాదపూర్వకంగా పుష్పగుచ్ఛంతో ఘనంగా స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో క్రైమ్ డీసీపీ దాసరి మురళీధర్, అదనపు డీసీపీ సంజీవ్, ఏసీపీలు జితేందర్‌రెడ్డి, రమేశ్ కుమార్, అర్బన్ సీఐ ఎలబోయిన శ్రీనివాస్, ఎస్సైలు అరుణ్, శ్వేత పాల్గొన్నారు.


బహిరంగ సభకు జరుగుతున్న ఏర్పాట్లు


పాలకుర్తి మండలం దర్దేపల్లిలో బతుకమ్మ ఆడుతున్న మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు


స్టేషన్‌ఘన్‌పూర్‌లోని చెరువు కట్టపై బతుకమ్మలతో మహిళలు

## బతుకమ్మ బతుకమ్మ ఉయ్యాలో..

ఎంగిలిపూల బతుకమ్మ వేడుకలు జిల్లాలో అంబరాన్నంటాయి. గ్రామాలు, పట్టణాల్లో ఆడబిడ్డలు శనివారం సాయంత్రం ఊరి చివరలోని చెరువుల వద్ద బతుకమ్మను కొలుస్తూ పాటలు పాడారు. అనంతరం బతుకమ్మలను నిమజ్జనం చేశారు.


జనగామ పట్టణంలో బతుకమ్మ ఆడుతున్న మహిళలు


జఫర్‌గఢ్‌లో..